

చెరువులో పనిచేస్తుండగా
గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-గరివిడి

మండలంలోని దువ్వాం గ్రామంలో ఉపాధి హామీ పని చేస్తుండగా కూలీ నక్క దుర్గారావు(47) గుండెపోటుతో మృతి చెందాడు. చెరువులో తోటి కూలీలతో కలిసి పనిచేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య నక్క గౌరమ్మ (42), కుమార్తె శ్రావణి (23) ఉన్నారు. గౌరమ్మ అదే గ్రామంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకురాలుగా విధులు నిర్వహిస్తుంది. దుర్గారావు మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.



మృతుడు దుర్గారావు (ఫైల్)

పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం

ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రవేశాలకు 15 లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు రెండో దశలో సీట్ల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. 2023-24 విద్యా సంవత్సరంలో ఒకటో తర గతిలో 25 శాతం సీట్లను కేటాయించే ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తాజాగా ప్రకటించారు. ఈనెల 6 నుంచి 15వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 22న ప్రవేశాలకు లాటరీ నిర్వహిస్తా మని, 24 నుంచి 28వ తేదీ వరకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. దీంతో పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్లు పొందడానికి మరో అవకాశం లభించింది.

మొదటి దశలో 625 మందికి అవకాశం

జిల్లావ్యాప్తంగా సుమారు 300కి పైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గత నెలలో ప్రభుత్వం ప్రకటించింది. ఏప్రిల్ 6నుంచి 16వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరించారు. ప్రవేశాల కోసం గతనెల 13,25 తేదీల్లో లాటరీ నిర్వహించారు. రెండు విడతల్లో కలిపి 625మందికి సీట్లు కేటాయించారు. వారిలో 478మంది వివిధ పాఠశాలల్లో ఇప్పటి వరకు ప్రవేశాలు పొందారు.

15 వరకు రెండోదశ దరఖాస్తుల స్వీకరణ

రెండో దశలోసీట్ల భర్తీకి తాజాగా ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. అర్హులైన వారు హెచ్‌టిపి.సిఎస్‌ఇ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 22 వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. 22న లాటరీ పద్ధతిలో సీట్లను కేటాయిస్తారు. 24నుంచి 28వరకు ప్రవేశాలు పొందడానికి అవకాశం కల్పిస్తారు.



ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లను రిజ ర్వేషన్ ఆధారంగా కేటాయిస్తారు. అనాథ, హెచ్ఐవి బాధితుల పిల్లలకు 5శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ఎస్‌సి పిల్లలకు 10శాతం, ఎస్‌టి పిల్లలకు 4శాతం, బిసి, మైనార్టీ, ఒసి పిల్లలకు 6శాతం సీట్లు కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల ఆదాయం రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.4లక్షలు లోపు ఉండాలి.

వెంటనే దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్స రానికి సంబంధించి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆర్‌టిఇ చట్టం ప్రకారం 25 శాతం సీట్లు ఉచి తంగా భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా రెండో దశలో సీట్ల భర్తీకి ఈ నెల 15వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది. అర్హత కలిగిన పేద పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

బి.లింగేశ్వర రెడ్డి, డిఇఒ



స్పందన కన్నా జగనన్నకు చెబుదాం మిన్న

- మూడు రకాలుగా అర్జీలు స్వీకరణ
- ప్రతి అర్జీకీ జవాబుదారి : కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల కాలం వరకు ప్రభుత్వం నిర్వహించిన స్పందన కార్యక్రమం కన్నా జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం మిన్నగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. నేరుగా లేదా వెబ్‌సైట్ ద్వారా లేదా 1902 ఫోన్ నెంబర్ ద్వారా అర్జీ లేదా పిటిషన్లు సమర్పించవచ్చని వివరించారు. ప్రతి అర్జీ లేదా పిటిషన్‌కూ జవాబుదారీగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అత్యున్నత స్థాయిలో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలు తమ ఇంటివద్ద నుంచే ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలపై సమస్యలుంటే టోల్ ఫ్రీ నెం.1902కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని, సంబంధిత సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చని అన్నారు. సమస్యలు పరిష్కరించిన తర్వాత కాల్ సెంటర్ ప్రతినిధి స్వయంగా ఫోన్ చేసి సంబంధిత ఫిర్యాదుదారు నుంచి అభిప్రాయాన్ని కూడా సేకరించే బృహత్తరమైన కార్యక్రమం జగనన్నకు చెబుదాం అని అభివర్ణించారు. ఈ వేదికను ఉపయోగించుకొని ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న స్పందనకు ఇది మరింత మెరుగైన రూపమని, సేవల విస్తృతికి ఈ వేదిక దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం జరిగే స్పందన యథావిధిగా సాగుతుందని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం అనేది స్పందన 2.0గా పరిగణించాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించామని చెప్పారు. ఆడిట్ టీం, మానిటరింగ్ టీములు ఉంటాయని ప్రత్యేక సేవలందిస్తాయని తెలిపారు. ఇక్కడ నమోదయ్యే ఫిర్యాదులను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా వినతుల పరిష్కారంలో నాణ్యతను సాధించడం, సకాలంలో వినతులను పరిష్కరించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బందాలు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పని చేస్తాయని వివరించారు. 1902కు ఫోన్ చేయటం ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలకు, సంక్షేమ పథకాలు, ఇతర వ్యక్తి గత స్థాయిలో ఉండే ఎలాంటి సమస్యనైనా చెప్పుకోవచ్చని స్పష్టం చేశారు. ఫిర్యాదు స్వీకరించిన తర్వాత ప్రత్యేక వైఎస్ఆర్ (యువర్ సర్వీస్ రిక్వెస్టు) ఐడి వస్తుందని, దాని సహాయంతో ఎప్పటికప్పుడు మెసేజ్ల రూపంలో ఫిర్యాదు తాలూక అప్ డేట్స్ వస్తాయని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజలకు మెరుగైన రీతిలో సేవలందించేందుకు వీలుగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ వివిధ దశల్లో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అవగాహన కల్పించే తీసుకొనే చర్యల గురించి వివరిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా, డివిజన్ స్థాయి శిక్షణల అనంతరం, సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఫిర్యాదుల అందిన తర్వాత వాటి పరిష్కార దశను కనుక్కునేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేక ఆడిట్ టీంను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్ సిఇఒ, ప్రత్యేక ఉప కలెక్టర్, పంచాయతీ రాజ్ అధికారి, ఒక డిప్యూటీ తహశీల్దార్, మెడికల్ అధికారి ఉంటారని వివరించారు. పర్యవేక్షణాధికారులుగా సిపిఒ, సాంకేతిక విభాగం నుంచి ఒక అధికారి వ్యవహరిస్తారని వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఎస్‌పి శ్రీనివాసరావు, సిపిఒ బాలాజీ పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 30వ డివిజన్ ధర్మపురిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు అందిన పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. కాలువల్లో పూడిక పెరిగిపోవడం పట్ల పారిశుధ్య పర్యవేక్షకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జి మారెం బాలబ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృతంలో అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. అమ్మఒడి, ఆసరా, పింఛన్లు, వసతి దీవెన, సున్నావడ్డీ వంటి అనేక సంక్షేమ పథకాలు అందుతూ ప్రతి ఇంటా పథకాల పంటగా కొనసాగుతోందని అన్నారు. కార్యక్రమంలో, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు, జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, డివిజన్ ఇన్చార్జి పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం తదితరులు పాల్గొన్నారు.

పివి రావు ఆశయాలు సాధిస్తాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాల మహానాడు వ్యవస్థాపకుడు పోతుల విఘ్నేశ్వరావు ఆశయసాధనకు మాలలంతా కృషి చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ దండుమారమ్మ గుడి వద్దగల ఆసంఘం కార్యాలయంలో జరిగిన పివి రావు 74వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీడి రామకష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాడ లేని వర్మీ కంపోస్ట్

- సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారించని రైతులు
- నిరుపయోగంగా షెడ్లు
- కొన్ని చోట్ల శిథిలం
- అధికారుల్లో సమన్వయ లోపం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-రేగిడి

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, పంటలకు సేంద్రియ ఎరువులు వాడకం పెరగాలని ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వర్మీ కంపోస్ట్ ఎరువుల యూనిట్ మంజూరు చేసింది. కానీ ఆ దిశగా గ్రామపంచాయతీ స్థాయిలో పూర్తిస్థాయిలో వర్మీ కంపోస్టు ఎరువుల యూనిట్లు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ యూనిట్ నిర్మాణానికి ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెలుగు సిబ్బంది సమన్వయంతో వీటిపై గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు సేంద్రీయ ఎరువులు వాడకంపై చైతన్యం వంతులుగా తయారు చేయవలసి ఉంది. కానీ ఈ రెండు శాఖ అధికారులుపట్టించుకోకపోవడంతో గ్రామాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ ద్వారా వర్మి కంపోస్ట్ యూనిట్లు నిర్మించి వాటిని పర్యవేక్షించిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే కొన్నిచోట్ల షెడ్లు నిర్మించి వదిలేశారు. మరికొన్నిచోట్ల షెడ్లు నిర్మించిన సేంద్రియ ఎరువులు తయారీపై మొగ్గ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల వర్మీ కంపోస్ట్ యూనిట్లు శిథిలమై వాటిపై పిచ్చి మొక్కలు మొలిసి ఉన్నాయి. అలాగే స్థలాలు లేకపోవడంతో మరికొన్నిచోట్ల పూర్తిగా వర్మీ కంపోస్టు ఎరువులు యూనిట్లు తయారీకి ముందుకు రావడం లేదు. నిర్మించి వదిలి వేయడం తప్ప వాటి బాగోగులు చూడకపోవటంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది.

358 షెడ్ల నిర్మాణం

మండలంలోని 39 గ్రామ పంచాయతీలకు గాను 18 పంచాయతీల్లో రూ.26 లక్షల వ్యయంతో వర్మి కంపోస్ట్ షెడ్లు నిర్మాణాలు చేపట్టారు. మరో 106 షెడ్ల నిర్మాణానికి 15 లక్షలు వ్యయంతో జనరేట్ చేశారు. వీటిలో 90 షెడ్లు వరకు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ నిధులు అప్పటి ఎంపిడిఒ బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. పనసల వలస, మునకలవలస, కొర్ల వలస, తాటిపాడు, బాలకావి వలస, కాగితాపల్లి, కోడిస, సరసనాపల్లి, ఖండ్యాం తదితర గ్రామాల్లో వర్మి కంపోస్ట్ ఎరువులు యూనిట్లు నిర్మాణాలు చేపట్టారు.



నిరుపయోగంగా ఉన్న వర్మీ కంపోస్టు యూనిట్

ఒక్కొక్క యూనిట్‌కు రూ.16వేలు మంజూరు

కొలతల ప్రకారం ఒక్కొక్క షెడ్డు నిర్మాణానికి రూ.14వేల నుంచి రూ.16వేలు వరకు మంజూరు చేశారు.. నిధులను ఖర్చు చేశారే తప్ప, పథకం మాత్రం నీరుగారింది. షెడ్ల నిర్మాణంలో ఫీల్డ్ పనుల కింద రూ.2.36 లక్షలు, మెటీరియల్ కింద రూ.32.12 లక్షలు చెల్లించారు. కానీ చాలా గ్రామాల్లో ఈ పథకం ఆచరణ లేక మూలకు చేరాయి. కొన్ని పంచాయతీల్లో వర్మీ కంపోస్టు యూనిట్లు నేలమట్టం అయ్యాయి. కొన్ని శిథిల మయ్యాయి. రైతులు సేంద్రియ ఎరువులు తయారు చేసే దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వ నిధులు ఇలా నీరుగారడం, ప్రజాధనం దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు విమర్శిస్తున్నారు.



పరీక్షా కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థులు

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష

88.15 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం ప్రాంతాల్లో బుధవారం జరిగిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మూడుకేంద్రాల్లో విజయనగరంలో 14 కేంద్రాలు, బొబ్బిలిలో 9కేంద్రాల్లో, గజపతినగరంలో 7 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు విజయనగరంలో 4940 మందికి 4562 మంది (92.35 శాతం) హాజరయ్యారు. బొబ్బిలిలో 2544 మందికి 2127 మంది (83.61 శాతం), గజపతినగరం లో 1930 కి 1609 మంది (83.37 శాతం) హాజరయ్యారు. జిల్లా మొత్తం 30కేంద్రాల్లో 9414 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8298 మంది (88.35 శాతం హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగిందని కన్వీనర్ జె.ఆశారమణి తెలిపారు.

ఆటలతోనే శారీరక ఎదుగుదల

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఆటలతో శారీరక ఎదుగుదల ఎక్కువగా ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.చిట్టిబాబు అన్నారు. బుధవారం స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఈశ్వరరావు మాస్టర్ నీతి కథలు బోధన, పిఎస్ రావు మాస్టర్‌తో డ్రామా, చిట్టిబాబు ఆటలు కోసం విద్యార్థులకు వివరించారు. ముందుగా ఈశ్వరమ్మ విద్యార్థులకు కొన్ని నీతి కథలు బోధించి వాటి సారాంశాన్ని వివరించారు. కథలో నాటికలు సమాజంలో ఏ విధంగా వాటి పాత్ర ఉంటుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలన్నీ డిప్యూటీ లైబ్రేరియన్ బి.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎన్. లలిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా ఎపిడి శారదాదేవి

ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పనులు చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ విధిగా జాబు కార్డులు మంజూరు చేస్తామని ఆ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎపిడి) ఎస్ శారదాదేవి స్పష్టం చేశారు. ఎల్ కోట, జామి, ఎస్ కోట, కొత్తవలస, వేపాడ మండలాల ఎపిఒలు, జెసి, ఇసిలతో బుధవారం మండలంలోని ఆ పథకం సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే గుర్తింపు కార్డుతో కుటుంబ సభ్యులు ఒకరి కన్నా ఎక్కువమంది ఉన్నవారు విధిగా జాబు కార్డులు పొందాలన్నారు. వారి వారి ఆధార కార్డు, బ్యాంక్ అకౌంట్ నెంబరు ఆధారంగా విధిగా జాబు కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఆర్టికల్చర్ ద్వారా జీడి, మామిడి, కొబ్బరి, జామ, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి మొక్కలు ఎకరానికి 70 మొక్కలు సాగు నిమిత్తం ఇవ్వనున్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల పాటు పెంపకం సమయంలో నీటి సాగుకు, పరిరక్షణ కోసం ఒక్కో మొక్కకు రూ.12.30 పైసలు చొప్పున మెయింటినెన్స్ ఛార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. సొంతంగా ఎవరైనా రైతులు మొక్కలు కొనుగోలు చేసిన వాటికి కూడా ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తుందన్నారు. పంచాయితీలలో అమృత సర్వర్ ట్యాంకులను గుర్తించి దాని చుట్టూ మొక్కలు వేసి పరిరక్షించేందుకు రూ.2లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో లక్కవరపుకోట, జామి, కొత్తవలస, వేపాడ, ఎస్ కోట ఎపిఒలు రమ్య, శేఖర్, విజయలక్ష్మి, నాయుడు, తిరుపతి, జెఇలు, ఇసిలు పాల్గొన్నారు.

ఇక నుంచి ఇ-స్టాంపు పేపర్లతోనే లావాదేవీలు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డిఐజి విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఇప్పటి వరకు ఉన్న నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు ప్రత్యామ్నాయంగా ఈ-స్టాంపుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీని ప్రకారం ఇక నుంచి అన్ని లావాదేవీలు ఇ-స్టాంపింగ్ విధానంలోనే సాగనున్నా యని స్టాంపులు, రిజస్ట్రేషన్ల శాఖ డిఐజి పి.విజయలక్ష్మి పేర్కొన్నారు. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌తో ఈ-స్టాంపింగ్ విధానం ద్వారా ప్రజలకు సేవలు అందుతాయని తెలిపారు. స్టాంపుల విక్రయ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తుందని వివరించారు. నూతన విధానానికి చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ-స్టాంపింగ్ కేంద్రాల, లైసెన్డ్ వెండర్ల వివరాలను www.registration.ap.gov.in, http://www.shcilestamp.com వెబ్ సైట్లను సంప్రదించటం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. సులభంగా, వేగంగా సేవలందించే ఈ నూతన విధానాన్ని ప్రజలను అనుసరించి విస్తత సేవలు పొందాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ సేవలు అందుతాయని ప్రకటనలో వివరించారు.



'గోబడ్డిలో' చేరండి... స్వయం ఉపాధి పొందండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన విజయనగరంలో మన గోబడ్డి యాప్ లో చేరి ఉపాధి అవకాశాలు పొందాలని గోబడ్డి ప్రతినిధులు పంచాడ నర్సింగరావు, శివకుమార్, రాజ్ గౌడ్లు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో గోబడ్డి ఆన్లైన్ యాప్ కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గృహ, ఆఫీసు అవసరాలకు ఏ విధమైన సర్వీస్ కైనా చిరునామా గోబడ్డి యాప్ అని తెలిపారు. హోం సర్వీసెస్, ఆఫీస్ సర్వీసెస్ కోసం విజయనగరంలో మొట్టమొదటిసారిగా ఆన్‌లైన్ యాప్' గోబడ్డీ యాప్ అందుబాటులో ఉందన్నారు. ఈ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారులు తమ గృహ ఆఫీసు అవసరాల కోసం ఎలక్ట్రిషియన్, ప్లంబర్, పెయింటర్, ఎసి మెకానిక్, హౌస్ కీపింగ్, డ్రైవర్ల కోసం ఆర్డర్ చేసిన వెంటనే 24గంటలెకల మీ ఇంటి వద్దకే వచ్చి సర్వీస్ అందిస్తారని తెలిపారు. గోబడ్డి సంస్థ ఆధ్వర్యంలో పనిచేసేందుకు ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు పెయింటర్లు, ఎసి మెకానిక్‌లు, డ్రైవర్‌లు, హౌస్ కీపింగ్ వర్కర్క్ కావాలని తెలిపారు. అవకాశాన్ని నిరుద్యోగులు అందరూ వినియోగించుకుంటారని ఆశిస్తున్నామన్నారు. గోబడ్డి యాప్ లో ఉపాధి పొందడానికి, గృహ, ఆఫీస్ సర్వీసెస్ పొందడానికి 9347785705 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్

సామాజిక న్యాయం దిశగా చర్యలు

సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ప్రజల సంక్షేమమే నిరంతర అభివద్ధికి అసలైన నిర్వచనం అని రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టిందని, దానిలో భాగంగానే విద్య, వైద్య రంగంలో అనేక సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పేర్కొన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లోనే అన్ని వర్గాల వారికి, ముఖ్యంగా దళితులకు న్యాయం జరిగిందని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా 1.40కోట్ల మందికి లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కూడా దళిత బంధు పథకం ప్రవేశపెట్టే యోచన ఉందని విలేకర్లు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. భూములు కొనుగోలు విధానాన్ని పునరుద్ధరించనున్నామని మరొక ప్రశ్నకు సమాధానం చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఎస్‌సిసెల్ ప్రతినిధులు రాజబాబు, వెంకటరావు, శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు జై హింద్ కుమార్ పాల్గొన్నారు.

డైట్ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల : అర్హులైన విద్యార్థులు డిఇఇ సెట్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డిఇఇ సెట్ 2023 ప్రవేశానికి స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ ప్రకటన నేపథ్యంలో డిఇఇ సెట్ 2023 ప్రవేశానికి ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 1నాటికి 17సంవత్సరాలు నిండి కళాశాలలో ప్రవేశ సమయానికి బిసి, ఒసి అభ్యర్థులు ఇంటర్ మీడియట్ 50శాతం మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు 45 మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. దరఖాస్తు, పరీక్ష రుసుము రూ. 750 ఈ నెల 27 లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 12, 13తేదీల్లో జరుగుతుందని అర్హులైన అభ్యర్థులు డిఇఇ సెట్ ప్రవేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా వేద పారాయణాలు

డెంకాడ: మండలంలోని గొందియ్య పాలెంలోని రామాలయ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ నిత్యార్చనలు, వేద పారాయణాలు, త్రిచ, అరుణ, సౌర పూర్వక సూర్య నమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రుద్రాభిషేకం, బిల్వార్చనలు, శేష హోమాలు, దిగ్బలి ప్రదానం, పంచ శయ్యాధివాసం, ధాన్యాధివాసం ఇత్యాదులు వైభవంగా నిర్వహించారు.

ఎంఇఒ కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు

వేపాడ: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయానికి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఈ పుస్తకాలను పాఠశాలల వారీగా బుధవారం సిఆర్‌పిలు రాంప్రసాద్, కోటేశ్వరరావు, లక్ష్మి విభజించారు. త్వరలో పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేస్తామని ఎంఇఒ జి. శ్రీదేవి ఈ సందర్భంగా తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

శరవేగంగా జెజెఎం పనులు

వేపాడ: మండలంలోని ముకుందపురం గ్రామానికి చెందిన జలజీవన్ మిషన్ (జెజెఎం) పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రూ. 8.71లక్షల నిధులతో ఇంటింటికి తాగునీటి సౌకర్యం నిమిత్తం పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ పూర్తి బాధ్యత వహించి త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

స్థలాల కబ్జాల వెనుక మౌనమెందుకు?

బొబ్బిలి : పట్టణ పరిధిలో ఉన్న ఐటిఐ కాలనీ, చీపురుబంద, అమ్మిగారి కోనేరు గట్టుల పైన ఆక్రమణలు చేసి ఇల్లు నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్, మండల తహశీల్దార్ అధికార పార్టీ నాయకుల కోసం పనిచేస్తున్నారా? ప్రజల కోసం పనిచేస్తున్నారా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తారకరామ కాలనీని ఆనుకుని ఉన్న చీపురు బందును ఇప్పటికే ఓ ప్రైవేట్ లే అవుట్‌కు లబ్ధి చేకూర్చేందుకు చెరువు కబ్జా చేసి హడావుడిగా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ఆ సిమెంట్ రోడ్డుకు మంజూరైన నిధులను ఆపాలని డిమాండ్ చేశారు. చీపురు బంద, అమ్మిగారి కోనేరు గట్టులపై జరుగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామని చెప్పి ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవడానికి గల కారణాలేంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న పాల్గొన్నారు.

రంగాపురంలో 880 ఎకరాల భూ సర్వే

లక్కవరపుకోట : మండలంలోని రంగాపురం గ్రామ పంచాయతీలో 880 ఎకరాల భూ సర్వేను బుధవారం నాటికి అధికారులు చేపట్టారు. తల్లిదండ్రుల నుండి సంక్రమించిన భూముల తగాదాలు, సరిహద్దుల ద్వారా సంభవించిన ఘర్షణలు, దీర్ఘకాలంగా వెంటాడుతున్న భూ సమస్యలను ఈ సందర్భంగా అధికారులు పరిష్కరించారు. అనంతరం పంచాయతీ సర్పంచ్ ఆవాల జయలక్ష్మి, సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాలలో అనేక రకాలైన భూ సమస్యల తగాదాలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. వాటిని పరిష్కరించడానికి భూ సర్వే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. భూములకు సంబంధించి ఎటువంటి సమస్యనైనా భూ సర్వే చేపట్టిన అధికారులకు విన్నవించుకోవచ్చని సూచించారు. తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, ఆర్ఐ రాజేష్, మండల సర్వేయర్ రామ, విఆర్‌ఒ బల్లంకి రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు

లక్కవరపుకోట : పాఠశాలలు వేసవి కాలపు సెలవులు దృష్ట్యా మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వివిధ క్రీడలలో తర్ఫీదినిచ్చారు. క్యారంబోర్డు, చదరంగం క్రీడలతోపాటు పేపర్ క్రాఫ్ట్ నేర్పించారు. నీతి కథలు వినిపించారు. లైబ్రరియన్ దామోదర్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు

పాఠశాలలో యోగా శిక్షణ

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పాఠశాల యోగ శిక్షకురాలు పొట్ట కళ్యాణి, పీడీ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో జోరుగా యోగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణ శిబిరంలో 50 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఈ ఉచిత యోగా శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణ శిబిరంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రణాయామాలు, ధ్యానం నేర్పుతున్నారు. ఈ శిక్షణ శిబిరం మే నెల 31వ తేదీ వరకు సాగుతుందని శ్రీరాములు తెలిపారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

బొబ్బిలి : ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ ఎడి ఎం.శ్యామసుందర్‌రావు అన్నారు. బొబ్బిలిలో స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగా కట్టెలు, పిల్లి పెసర వంటి విత్తనాలు సంసిద్ధం చేశామన్నారు. మండలానికి సంబంధించి 500 క్వింటాళ్ల జీలుగా, 400 క్వింటాళ్ల కట్టే జనుము, 100 క్వింటాళ్ల పిల్లి పెసర, సిద్ధం చేశామన్నారు. వీటి ధరలు 50 శాతం రాయితీ పోను 10 కేజీల జీలుగా రూ.395, 10 కేజీల కట్టే జనుము రూ. 420, 8 కేజీల పిల్లి పెసర రూ.38 చెల్లించి రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు సోమవారం నుండి రైతు భరోసా కేంద్రాల్లో సరఫరా చేస్తున్నామన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎడి శ్యామసుందర్‌రావు

నాడు-నేడు పనులు నెలాఖరుకు పూర్తి

- రీ సర్వే ప్రక్రియ వేగవంతం
- ఆరోగ్యం, స్త్రీశిశు సంక్షేమంపై దృష్టి సారించండి
- బొబ్బిలి పర్యటనలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి- బొబ్బిలి, బొబ్బిలి రూరల్

నాడు-నేడు పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేసి, పునఃప్రారంభానికి పాఠశాలలను సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని సూచించారు. బొబ్బిలిలో బుధవారం ఆమె పర్యటించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తనిఖీ చేశారు. నాడు -నేడు పనులను పరిశీలించారు.

ప్రత్యేక తరగతులకు హాజరు కావాలి

ప్రస్తుతం జరుగుతున్న నాడు-నేడు పనులను మే నెలాఖరునాటికి పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బొబ్బిలి మున్సిపాల్టీ పరిధిలోని గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూలు, కలువరాయి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న నాడు -నేడు పనులను ఆమె తనిఖీ చేశారు. గొల్లపల్లి పాఠశాలలో జరుగుతున్న పనులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవలే బిల్లులు పడినప్పటికీ, పనులు నెమ్మదిగా జరుతుండటంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలని, పాఠశాల పునఃప్రారంభం నాటికి తరగతి గదులను, మరుగుదొడ్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్‌ఒ ప్లాంటును కలెక్టర్ తనిఖీ చేసి, స్వయంగా చేతితో ఆర్‌ఓ నీటిని తాగి పరిశీలించారు. పదోతరగతి ఫలితాలపై ఆరా తీశారు. పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను ఆమె పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పది తప్పిన విద్యార్థులంతా ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులతో పాటు, సచివాలయ సిబ్బంది కూడా విద్యార్థులను చైతన్యపరిచి, ఈ ప్రత్యేక తరగతులకు తీసుకురావాలని స్పష్టం చేశారు. పాఠశాలల పునఃప్రారంభం తరువాత, పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా తప్పనిసరిగా ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ లేదా దానికి సమానమైన కోర్సుల్లో చేరేలా చూడాలని, వారి కొత్త అడ్మిషన్ నెంబర్లు, పూర్తి వివరాలను తమకు అందజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలను మరింత మెరుగుపర్చడం ద్వారా, విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు భరోసా కల్పించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ కోరారు.



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రీసర్వే త్వరగా పూర్తి చేయాలి

భూసర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కృష్ణాపురంలో జరుగుతున్న రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులను ఆమె తనిఖీ చేశారు. కలెక్టర్ స్వయంగా పంట పొలాల్లోకి వెళ్లి, రాళ్ళు పాతే విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు నిర్వహించిన సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. మరిన్ని బృందాలను ఏర్పాటు చేసి, సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

పాలిసెట్ పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ

బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కోమటిపల్లిలోని స్వామి వివేకానంద పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. మిగిలిన అన్ని సెంటర్లను తనిఖీ చేయాలని ఫ్లయింగ్ స్క్వాడ్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ఆరోగ్యం, స్త్రీశిశు సంక్షేమంపై దృష్టి పెట్టాలి

ప్రజల ఆరోగ్యం, స్త్రీశిశు సంక్షేమంపై సిబ్బంది దృష్టి పెట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఆమె బుధవారం బొబ్బిలి మండలం కలవరాయి గ్రామ సచివాలయాన్ని, మున్సిపాల్టీలోని కంచరవీధిలోని 4వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరును, వివిధ కార్యక్రమాల అమలు తీరును తెలుసుకున్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం, పిల్లలకు గర్భిణిలకు పోషకాహారం పంపిణీ, రక్తశాతం, పిల్లల ఎత్తు, బరువు నమోదు తదితర అంశాలపై ఎఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశ్నించారు. వారి రికార్డులను, యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. మహిళల్లో రక్తహీనతపై ప్రశ్నించారు. మహిళలకు కనీసం 11 ఎంజి హీమోగ్లోబిన్ శాతం ఉండాలని, అంతకంటే తక్కువ ఉంటే రక్తహీనత ఉన్నట్లేనని స్పష్టం చేశారు. గర్భిణులకు వెంటనే మరోసారి హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రిపోర్టులను తమకు పంపించాలని ఆదేశించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తుదిదశకు చేరుకున్న భవనాలను ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలని సూచించారు.

మున్సిపాల్టీలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ, సేంద్రీయ ఎరువుల తయారీపై సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు. తాగునీటి సరఫరా, సఖి గ్రూపుల నిర్వహణ పై ఆరా తీశారు. గృహ నిర్మాణంపై ప్రశ్నించారు. క్షేత్రస్థాయి తనిఖీలను ముమ్మరం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరంలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, శతశాతం చేరికలు జరగాలని సచివాలయ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఇన్‌ఛార్జి ఆర్‌డి సుదర్శనదొర, తహశీల్దార్ ఎన్.రాజారావు, ఎంపిడిఒ భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, హౌసింగ్ డిఇ అప్పాజి, ఎఇ సింహాచలం, పిఆర్ ఎఇ రాజశేఖర్, ఎంఇఒ సిహెచ్ లక్ష్మణరావు, ఎఒ శ్యామ్‌సుందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకొండలో గడప గడపకు..


ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రతి గడపకూ సంక్షేమం అందిస్తుందీ ప్రభుత్వమని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ఎరుకొండలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 100వ రోజుకు చేరుకొందన్నారు. ఏ ఊరువెళ్లినా ఏ గడపకు వెళ్లినా ఈ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారన్నారు. సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుని ఇంటికే వెలుతున్నాయన్నారు. అందుకే ఈ ప్రభుత్వానికి మద్దతుగా కులమతాలకు అతీతంగా ఆదరణ చూపిస్తున్నారన్నారు. మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి మళ్లీ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మనమంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, మండల శాఖ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణ రాజు, నాయకులు మహంతి జనార్ధనరావు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలోకి 25 కుటుంబాలు చేరిక

ఎరుకొండలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉప సర్పంచ్ ఆల్తి శ్రీనుతో పాటు 25 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు అధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరారు. వారిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్‌తో పాటు వాళ్లె సత్యన్నారాయణ, పిన్నింటి రమణ, తాడవాడ సీతారాం, వలిరెడ్డి దుర్గప్పడు తదితరులు ఉన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని దాసుళ్లపాలెంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి, ప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందే తీరుపై ఆరా తీశారు. ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్), జెడ్‌పిటిసి తుర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ మదీన, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రామతీర్థం హుండీ లెక్కింపు

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి ఆలయానికి చెందిన హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి మే 20 వరకూ వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 24.64 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ డివివి ప్రసాద రావు తెలిపారు. ట్రస్ట్ బోర్డ్ మెంబర్ డి.సత్యనారాయణ రాజు, టి. శ్రీనివాసరావు, దేవాలయం సిబ్బంది, నెల్లిమర్ల పోలీస్ సిబ్బంది, రామతీర్థం ఎపిజివి బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవ సంఘాలు సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ సరోజిని

డ్రోన్ సర్వే ప్రారంభం

నెల్లిమర్ల : నగర పంచాయతిలో బుధవారం చైర్‌పర్సన్ బంగారు సరోజినీ డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ సంధర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రిసర్వేలో భాగంగా డ్రోగో ఏజెన్సీ వారిచే డ్రోన్ ద్వారా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో ఉన్న భూములను సర్వే చేసే నిమిత్తం సర్వే ప్రారంభంచారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కమిషనరు పి.బాలాజీ ప్రసాద్, టిపిబిఒఎం పి. జనార్ధనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు హాస్టల్ సదుపాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఇంటర్నషిప్‌కి హాజరయ్యే విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి. చిన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం తహశీల్దార్ శ్రీనివాసరావుకి ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. అంతరం చిన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం డిగ్రీ 3వ సంవత్సర విద్యార్థులకు ఇంటర్నషిప్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. మరోపక్క మండలంలో ఉన్న అన్ని సంక్షేమ హాస్టల్స్ మూసివేయడం జరిగిందన్నారు. డిగ్రీ సర్టిఫికె ట్‌తో ఇంటర్నషిప్ ముడిపెట్టిందని దీని వల్ల విద్యార్థులు ఇంటర్నషిప్ క్లాసులకు సరైన హాజరు లేకుంటే సర్టిఫికెట్ అందుకోలేని పరిస్థితి ఉందని చెప్పారు. దూర ప్రాంత విద్యా ర్థులకు వసతి లేని కారణంగా రోజూ ప్రయాణం చేసి రాలేక పోవడం, విద్యా సంవత్సరం నష్టపోయే పరిస్థితి ఏర్పడిం దన్నారు. అందుకే సంక్షేమ హాస్టల్స్‌ని తెరిపించి, ఇంటర్నషిప్‌కి హాజరయ్యే విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.రమేష్, నాయకులు రాము పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతినిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గ్రామాభివృద్ధి పై ఎమ్మెల్సీ సమీక్ష

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మొయిద సచివాలయం పరిధిలో మొయిద విజయరాంపురం, నారాయణ పట్నం, పూతిక పేట గ్రామాల వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, మండల స్థాయి ఇంజినీర్లతో ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సేవలు, అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

లైన్ మేన్ కుటుంబానికి పరామర్శ

ఇటీవల విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందిన జరజాపుపేటకు చెందిన లైన్‌మేన్ మద్దిల శివ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు బుధవారం పరామర్శించారు. జరజాపుపేటలో మృతుని ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో అంతా అండగా ఉంటామని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వాహన తనిఖీలు

వంగర : మండలంలోని ఎం సీతారాంపురం కూడలి వద్ద ఎస్ఐ ఆర్. జనార్ధనరావు ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవరు లైసెన్సు తనిఖీ చేసి వాహనాల నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రోజు రోజుకు ఉష్ణోగ్రతలు ఎక్కువవుతున్నాయని వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు విద్యార్థులకు సూచించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను సమావేశ పరచి వడదెబ్బ-జాగ్రత్తలు అనే విషయం పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకోకుండా ఎండలో తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి చెమట పట్టక పోవటం, శరీర ఉష్ణోగ్రత పెరగటం, వణకు పుట్టటం, మగతగా ఉండటం, అపస్మారక స్థితిలోకి వెళ్లటం జరుగుతుందన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతలుండే సమయంలో ఎక్కువుగా తిరగ రాదని, చల్లని రంగు పానియాలు తాగకుండా, రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినకూడదని, మాంసాహారం తగ్గించి మద్యం జోలికి వెళ్లకూడదని అన్నారు. నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువుగా తీసుకోవాలన్నారు.




ఎండలపై సూచనలు చేస్తున్న జెసి రాజు

టిడిపి హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి - గుర్ల

టిడిపి హాయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. మండలంలో మన్యపురిపేటలో మంగళ వారం రాత్రి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన టిడిపితోనే సాధ్యమన్నారు. పాలకులు ప్రజల జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకోవా లన్నారు. ప్రభుత్వం అవలంభి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపు, నిత్యావసరాల సరుకుల ధరలు పెరుగుదల పై ప్రజలకు వివరించారు. అనంతరం వైసిపిని వీడి టిడిపిలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కల్లూరి శ్రీను, అప్పల రాజు, మామిడి శ్రీను, రెడ్డి నారాయణరావుతో పాటు పది కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగార్జున



పనులను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

అభివృద్ధి పనులు పరిశీలన

నెల్లిమర్ల : మండలంలోని రామతీర్థంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. రామతీర్థం నుండి బోడికొండపైకి జిల్లా పరిషత్ నిధులతో మంజూరు చేసిన రోడ్డు పనులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన ఫారం పాండ్‌ను పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పథకాల గురించి ఎంపిడిఒ జి. గిరిబాలను అడిగి తెలుసుకున్నారు. ఇఒపిఆర్‌డి బానోజీరావు, పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో సమావేశం

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామంలో ఎంపిడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్ సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి గురించి సిబ్బందితో చర్చించారు. అనంతరం గ్రామ సచివాలయ రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో సర్పంచ్ వేమన రాము నాయుడు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ పట్నాయక్ డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో ఉన్న ఎలక్ట్రికల్ పరికరాలు, స్కానర్లు గురించి అడిగి తెలుసుకున్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధ్యాయుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మాయిల కోసం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల)లో చేరికల కోసం పాఠశాల ఉపాధ్యాయులు విస్తృ తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉపాధ్యాయులందరూ చామ లాపల్లి, మామిడిపల్లి, ధర్మవరం, వేముల పల్లి, పోతనాపల్లి, ధర్మవరం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పాసైన అమ్మాయిల ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి పిల్లలను మహిళా కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సఫీనా బీ, జి అనంతలక్ష్మి, చలుమూరి పేరినాయుడు, బి కిరణ్ కుమార్, అలుగోలు వీరాస్వామి, చిప్పాడ శ్రీనివాస రావు, లగుడు వెంకట సత్యనారాయణ, రహీం షేక్ లాల్ తదితరుల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడకు చెందిన చింతపల్లి సూర్యనారాయణ (45) బుధవారం విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో గల అరబిందో పరిశ్రమంలో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకుని తిరిగి వస్తుండగా మండలంలోని సిపి పరిశ్రమ కంపెనీ వద్ద జాతీయ రహదారిపై నిలిచి ఉన్న వ్యాన్‌ను వెనక నుండి బలంగా ఢీకొట్టాడు. దీంతో గాయాలైన అతన్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



సూర్యనారాయణ (ఫైల్)

నేరాలు ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సంఘటకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా మెంటాడ మండలం కొండమామిడివలసకు చెందిన బోయిన మురళి, గుమ్మడి సోములు పార్వతీపురం మండలం బందలుప్పి పంచాయతీ నిమ్మవానివలసలో జరుగుతున్న తమ స్నేహితుడి పెళ్లికి వెళ్తుండగా, పుట్టూరు పంచాయితీ దిబ్బగుడివలస మలుపు దగ్గర ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మురళి(26) మృతి చెందాడు. అతనితో పాటు ప్రయాణిస్తున్న రెడ్డివానివలసకు చెందిన గుమ్మడి సోములు (32)కు తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయన చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.



మృతులు సోములు, మురళి

యువకుడు మిస్సింగ్‌పై కేసు

మెరక ముడిదాం: మండలంలోని భగీరథపురం గ్రామానికి చెందిన ఆలుబిల్లి సాయికుమార్ (19) కనిపించడం లేదని బుధవారం బుధరాయవలస పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చినట్లు ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.